

సంక్షేమ రథసారథి జగన్
రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. - 10లో..



వీరులారా.. వందనం
కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరుల త్యాగాలపై ప్రత్యేక కథనం. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
30.5/25.1

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉరుముల మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాలోకి ప్రవేశించిన సాగర్ జలాలు

● జిల్లా సరిహద్దు 85/3 వద్దకు చేరిన 2,695 క్యూసెక్కుల నీరు



త్రిపురాంతకం: జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు నాగార్జున సాగర్ ప్రధాన కాలువ ద్వారా జిల్లాలోకి నీటి సరఫరా ప్రారంభమైంది. సాగర్ జలాలతో ఎస్ఎస్ ట్యాంకులు, తాగు నీటి చెరువులు నింపేందుకు నీటిని విడుదల చేశారు. నాగార్జున సాగర్ ప్రధానకాలువ 85/3 వద్ద జిల్లాలోకి 2,695 క్యూసెక్కుల నీటి సరఫరా ప్రారంభమైంది. ప్రధాన కాలువ ద్వార జిల్లాలోకి నీటి సరఫరా సాగుతుండటంతో ప్రజలు ఆనందంతో ఉన్నారు. జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి చెరువులు నింపేందుకు రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి నీటిని విడుదల చేయించారు. విడుదలైన సాగర్ నీటిని సద్వినియోగం చేసుకుని ఎస్ఎస్ ట్యాంకులు, తాగునీటి చెరువులను నింపేందుకు ఆర్‌డబ్ల్యూయస్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పొగాకు అత్యధిక ధర రూ. 251



టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 251 పలికింది. చింతలపాలెం, దావగూడూరు గ్రామాలకు చెందిన రైతులు 1028 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 971 కొనుగోలు చేసి 57 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.251, కనిష్ఠ ధర రూ.160, సరాసరి రూ.241.72గా నమోదైంది. వేలంలో 36 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

రూ.3.24 కోట్ల నిధులు మంజూరు

పెద్దదోర్నాల: పెద్దదోర్నాలలో కల్యాణమండపంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి శ్రీశైల దేవస్థానం నుంచి అనుమతులు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలకు సంబంధించి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గతంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపారు. శ్రీశైల ముఖద్వారంగా పేరున్న మండల కేంద్రంలో ఈ రెండింటి ఆవశ్యకతను మంత్రి సురేష్ అధికారులకు వివరించారు. ఈ నేపథ్యంలో దేవదాయ శాఖ కమిషనర్ శ్రీశైలం దేవస్థానం నిధుల నుంచి కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.1.26 కోట్లు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.1.98 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులు జారీ చేశారు. తక్షణమే పనులు చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేస్తూ జీఓ జారీ చేశారు. పట్టణంలో కల్యాణమండపం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి సురేష్‌కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు ప్రభుత్వ రుణాలు

● ఆగస్టు 10 లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు: దివ్యాంగులకు ప్రభుత్వం తక్కువ వడ్డీతో తిరిగి చెల్లించే పద్ధతిలో రుణాలు అందజేస్తుందని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసుండి కనీసం 40 శాతం అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు ఆగస్టు 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాణిజ్య, వ్యాపార, సేవా రంగాల్లో జీవనోపాధిని మెరుగుపరుచుకునేందుకు ఈ రుణాలు పొందవచ్చన్నారు. కేవలం 6 శాతం వడ్డీతో రూ.50వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు జిల్లాస్థాయి ఎంపిక కమిటీ ద్వారా మంజూరు చేస్తామని పేర్కొన్నారు. రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు కావాల్సిన వారు లబ్ధిదారుని వాటా కింద 5 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న దివ్యాంగులు నిర్ణీత వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని పూరించి సంబంధిత ధ్రువపత్రాలతో ఆగస్టు 10వ తేదీలోగా జిల్లా మేనేజర్, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకుడు, ఒంగోలు కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 08592-281310 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎండిన గొంతులకు జీవధారలు

ఒంగోలు ప్రజలు తాగునీటికి కటకటలాడారు. గొంతు తడవాలంటే గుక్కెడు నీటి కోసం పరితపించారు. ఇదీ ఒంగోలు నగరవాసులు టీడీపీ హయాంలో పడిన కష్టాలు. ఆ నాటి పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా సాగర్ జలాలు రాక అల్లాడారు. టీడీపీ ఎమ్మెల్యే కమీషన్ల కక్కుర్తితో నాడు కేంద్రం ఇచ్చిన రూ. 123 కోట్ల నిధులతో చేపట్టిన అమృత్ పథకం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ పథకానికి ఎమ్మెల్యే బాలినేని ప్రాణం పోశారు. ప్రభుత్వం నుంచి రూ. 70 కోట్లు తెచ్చి నగరానికి నీటి సరఫరా చేసే రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నిత్యం నీళ్లు ఉండేలా చేశారు. శాశ్వతంగా నగరవాసుల దాహార్తిని తీర్చేందుకు రూ. 370 కోట్లతో భారీ నీటి ప్రాజెక్టుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇది టెండరు దశ దాటింది. ఇక అగ్రిమెంట్ కావాలి. ఇది పూర్తయితే నగర వాసులకు ఇక రోజూ పుష్కలంగా నీళ్లే.

- శాశ్వత పరిష్కారానికి రూ.370 కోట్లతో భారీ ప్రాజెక్ట్ కు బాలినేని కృషి
- అమృత్ నిధులు రూ.71.29 కోట్లు సైతం తెచ్చి
- టీడీపీ హయాంలో తాగునీటికి కటకట
- కమీషన్లకు కక్కుర్తి పడి అమృత్ స్కీంను నిర్వీర్యం చేసిన దామచర్ల
- జిల్లాకు సాగర్ జలాలను ఇవ్వలేని చంద్రబాబు



ఒకటో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు నగర వాసులు ఒకప్పుడు తాగునీటి కోసం పడ్డ అవస్థలు అన్నీ, ఇన్నీ కావు. మూడు లక్షల జనాభా. సుమారు 85 వేల గృహాలు ఉన్న నగరంలో మంచి నీళ్ల కోసం ప్రజలు తిప్పలు పడ్డారు. టీడీపీ పాలనలో ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.చివరకు ట్యాంకర్ల ద్వారా సక్రమంగా నీటిని అందించలేని దుస్థితి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టిసారించింది.

రూ.123 కోట్ల ప్రాజెక్టుకు తూట్లు..

నగర ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు 2017లో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని మంజూరు చేసింది. దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పూర్తి చేయాలన్నది లక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వం కానీ, ఒంగోలు నగర పాలక సంస్థ కానీ పథక నిర్మాణంలో తన వాటా కింద రూ. 71.29 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. మిగతా రూ. 51.71 కోట్లు తన వాటాగా కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. గుండ్లకమ్మ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బావుల ద్వారా నగర ప్రజలకు ప్రతి రోజూ 90 మిలియన్ లీటర్లు(ఎంఎల్)నీటిని అందించే విధంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రాజెక్టు నుంచి పైపులైన్ల ద్వారా ఒంగోలు నగరానికి తీసుకురావటం పథకం ఉద్దేశం. ఈ పథకంలో కేంద్రం తొలి విడతగా రూ. 30 కోట్లు నిధులు మంజూరు చేసింది. ముక్తినూతలపాడు, ముండువారిపాలెం, వెంకటేశ్వర కాలనీల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు(ఓహెచ్ఎస్ఆర్) ఏర్పాటు చేశారు. వాటితో పాటు మున్సిపల్ నిధులతో ప్రత్యేకంగా మరో రెండు, మూడు ట్యాంకులు కూడా నిర్మించారు. వాటిని 60 మిలియన్ లీటర్లతో నింపుతారు. మిగతా 30 మిలియన్ లీటర్ల నీటిని ఇప్పటికే సాగర్ జలాలతో నింపుతున్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు(ఎస్ఎస్)తరలిస్తారు. కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులనే ఖర్చు చేస్తూ ముందుకు సాగారు. అప్పట్లో అంతా తానై కార్పొరేషన్‌ను నడిపిన అప్పటి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టలేకపోయారు.



ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యం..

ఒంగోలు నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న దామచర్ల రోడ్ల మీద రోడ్లు వేసి డబ్బులు కాజేయటమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. అమృత్ పథకం ద్వారా నగర ప్రజల కష్టాలు తీరుతాయనుకుంటే ఆ పథకానికి స్వయంగా దామచర్లే తూట్లు పొడిచాడు. తాము అధికారంలోకి రాగానే అమృత్ పథకం పూర్తి చేయటానికి పూనుకున్నాం. నగరపాలక సంస్థపై భారం పడకుండా చేయాలని నిర్ణయించాం. ముఖ్యమంత్రిని అడిగిందే తడువుగా గ్రాంట్ విడుదల చేశారు. అదే విధంగా ఒంగోలు నగర ప్రజలకు శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి రూ. 370 కోట్లు సీఎం వైఎస్ జగన్ మంజూరు చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే

శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారానికి రూ. 370 కోట్లు

పెరుగుతున్న నగర జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వతంగా మంచినీటి సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 370 కోట్లు మంజూరు చేసింది. సీఎం వైఎస్ జగన్ ఒంగోలు నగర పర్యటనకు వచ్చినప్పుడు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నగరంలోని మంచినీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శాశ్వతంగా మంచినీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తానని అప్పట్లో వేదికపైనే ప్రకటించారు. దీంతో ఒంగోలు నగరంలోని మంచినీటి వ్యవస్థ రూపురేఖలే మారిపోనున్నాయి. శివారు ప్రాంతాల్లో కూడా ప్రతి రోజూ మంచినీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఆ పథకం టెండర్ దశ పూర్తి చేసుకొని అగ్రిమెంట్ దశలో ఉంది.



దామచర్ల జనార్దన్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ అమృత్ స్కీం ద్వారా పర్సెంటేజీలు తీసుకొని పథకం పనులు నత్తనడకన నడిపిస్తున్నారన్న విమర్శలు గుప్పుమన్నాయి. పెద్ద ప్రాజెక్టు కావటంతో రూ. కోట్లలోనే పర్సెంటేజీలు అడిగినట్లు వినికిడి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తెప్పించలేకపోయిన దామచర్ల ఒంగోలు నగర పాలక సంస్థకు చెందిన కొంత మొత్తాన్ని ఆ పథకానికి బిల్లుల రూపంలో కూడా ఇప్పించి ముడుపులు పుచ్చుకున్నట్లు కూడా అప్పట్లో పెద్ద ప్రచారమే జరిగింది.



సాగర్ జలాలు తెప్పించలేని బాబు

టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాకు సాగర్ జలాలు రాబట్టడంలో తీవ్రంగా వైఫల్యం చెందారు. మరో వైపు వాతావరణం అనుకూలించకపోవటంతో అటు తాగు ఇటు సాగునీటికి జిల్లా ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఒకసారి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి వివరాలు, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సాగర్ జలాలు ఏవిధంగా జిల్లాకు వచ్చాయో లెక్కలు చూస్తే వాస్తవాలు అవగతమవుతాయి. జిల్లాకు తాగు, సాగు నీటి అవసరాల కోసం దాదాపు 60 నుంచి 65 టీఎంసీల వరకు రాబట్టాల్సి ఉంది. అయితే 2015లో 25 టీఎంటీలు మాత్రమే జిల్లాకు సాగర్ జలాలు వచ్చాయి. 2016లో 4.64 టీఎంసీలు, 2017లో 20.25 టీఎంసీలు, 2018లో 36.22 టీఎంసీలు మాత్రమే జిల్లాకు విడుదల చేశారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పరిస్థితి మారిపోయింది. 2019–20లో 60.57 టీఎంసీలు, 2020–21లో 67 టీఎంసీలు, 2021–22లో 65, 2022–23లో 68 టీఎంసీలు. ఈ సంవత్సరం ఒంగోలు నగరానికి ఇటీవల రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపేందుకు 1.50 టీఎంసీలు విడుదల చేశారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు నాలుగు రోజుల క్రితం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 5 టీఎంసీల సాగర్ జలాలు జిల్లాకు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతే వేగంగా కృష్ణమ్మ జిల్లాలోకి ప్రవేశించింది.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- అవినీతిపై ఆధారాలు చూపిస్తే రాజీనామా చేస్తా
- లేదంటే శాశ్వతంగా రాజకీయాలకు దూరం అని ప్రకటించాలి
- లోకేష్‌కు సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సవాల్

ఒంగోలు: 'అభివృద్ధిపై చర్చకు సిద్ధమే. ఎక్కడికి రావాలో చెప్పు..వ్యక్తిగతంపై నాపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపిస్తే రాజీనామా చేసేందుకైనా సిద్ధంగా ఉన్నా. జిల్లా సరిహద్దు దాటే లోగా చెప్పకుంటే శాశ్వతంగా రాజకీయాలకు దూరం అని ప్రకటించాలి' అని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు నారా లోకేష్‌కు సవాల్ విసిరారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర కేవలం వ్యక్తిగత దూషణకే పరిమితమైందన్నారు. సూర్యాస్తమయం తరువాత పాదయాత్ర ప్రారంభించి అర్ధ రాత్రి వరకు చేయడం కేవలం బూటకమన్నారు. లోకేష్ పాదయాత్రకు వస్తున్న జనం స్థానికులు కాదని, ఇతర ప్రాంతాల నుంచి తరలించి మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసే రోజుల్లో ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారని, పరిష్కరించని పక్షంలో తాము అధికారంలోకి వస్తే ఎలా పరిష్కరిస్తామో ప్రకటించేవారన్నారు. కానీ నేడు లోకేష్ పాదయాత్ర మొత్తంలో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, పక్కన మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఎక్కడా అటువంటి దృశ్యం లేదన్నారు. పాదయాత్ర పేరుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా కొనసాగుతుందని విమర్శించారు. 2 ఎకరాల భూమి ఉన్న మీ తండ్రి చంద్రబాబు నాయడు నేడు రూ.2 లక్షల కోట్లు ఎలా కూడబెట్టారని, పాలు అమ్మి ఇంత డబ్బు సంపాదించారా సమాధానం చెప్పాలంటూ ప్రశ్నించారు. నాపై రూ.50కోట్ల ఆరోపణలు చేశావని, వాటిని నిరూపించాలని సవాల్ విసిరారు.

ప్రకాశం జిల్లాకు పేపర్ మిల్లు, రామాయపట్నం పోర్టు, విమానాశ్రయం వంటివి ఎన్నో చెప్పావు...అవి ఎక్కడ ఉన్నాయో నిరూపించాలన్నారు. గుండ్లకమ్మ అభివృద్ధికి రూ.3 కోట్ల నిధులు వస్తే మొక్కల పేరుతో మెక్కేసింది మీరు కాదా అంటూ టీడీపీని విమర్శించారు. రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ సెంటర్లు, గ్రామ/వార్డు సచివాలయాలు, లింకురోడ్లు నిర్మాణం, నాడు-నేడు పనులు, ఇవన్నీ అభివృద్ధిలా కనిపించడం లేదా లోకేష్ అంటూ ప్రశ్నించారు. ఒక్క సంతనూతలపాడు నియోజకవర్గంలోనే రూ.30 కోట్లతో తారు రోడ్లు నిర్మించామన్నారు.

పాదయాత్ర కాదు ఈవెనింగ్ వాక్: బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

లోకేష్ చేస్తున్నది పాదయాత్ర కాదని, ఈవెనింగ్ వాక్ అని మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. సాయంత్రం 5గంటలకు ప్రారంభించి రాత్రి 10 గంటలకు ముగించడం ఆశ్చర్యంగా ఉందని, కేవలం టిప్‌టాప్‌గా తయారై ఈవెనింగ్ వాక్‌కు వెళుతున్నట్లుగా ఉందని అంతే తప్ప పేదల కష్టాలు తెలుసుకునేందుకు కాదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మిర్చి క్వింటాలు రూ.22వేలు, ధాన్యం రూ.1900, పొగాకు రూ.25వేలు ధరలు పలికాయని, ఇవి ఆల్‌టైమ్ రికార్డు అన్నారు. గతంలో గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంది వైఎస్సార్ అని, నేడు ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. చంద్రబాబు హయాంలో చదరపు అడుగుకు రూ.9 ఖర్చు అయ్యేదని, నేడు అది రూ.3.50లకు ఒక్క పైసా కూడా ఖర్చు కావడం లేదన్నారు. తద్వారా నేరుగా చదరపు అడుగుకు రూ.5.50 ఖర్చు తగ్గిందన్నారు. విద్యుత్ పెనాల్టీలు రూ.10 కోట్లు రద్దు చేయడంతో పాటు వంద హెచ్‌పి దాటితే హెచ్‌టీలోకి వెళుతున్నామని తద్వారా భారం పెరుగుతుందని పరిశ్రమ వర్గాలు కోరితే 149 హెచ్‌పీ వరకు ఎల్‌టీలోనే ఉంచిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. లోకేష్ ఎన్ని షో యాత్రలు ఎన్ని చేసినా జనం నమ్మే పరిస్థితి లేదన్నారు.

ఓటర్ల పరిశీలన వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

● ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ఓటర్ల పరిశీలన వేగవంతం చేయాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఉదయం తన నివాసంలో సమీక్షించారు. ఓటర్ల ప్రక్రియలో ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రస్తుతం బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ తిరుగుతున్నందున మన పార్టీ తరుపున కూడా తప్పకుండా పాల్గొని పరిశీలించాలన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలని, అర్హులైన ఓటర్లు ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారిని గుర్తించి వారు ఓటుకు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఎక్కడైనా దొంగ ఓట్లు ఉంటే మాత్రం వాటిని తక్షణమే గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఈ విషయంలో డివిజన్ల వారీగా డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు సమావేశాలు నిర్వహించి వార్డుల్లో ఉత్సాహంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా లోపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే తన దృష్టికి విషయాన్ని తీసుకురావాలన్నారు. ప్రతి డివిజన్‌లో ఓటరు జాబితాను జాగ్రత్తగా దగ్గర ఉంచుకుని వాస్తవాలను పరిశీలించాలని సూచనలు చేశారు. సమావేశంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, కటారి శంకర్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ సీపీ నాయకులు గంటా రామానాయుడు, గొర్రెపాటి శ్రీనివాసరావు, అయినాబత్తిన ఘనశ్యాం, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఇతర నేతలు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులు

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి

● కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు: ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో అభివృద్ధి, సంక్షేమ అంశాలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్య భవనాలైన సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు నిర్మాణాలు పూర్తయిన వెంటనే సంబంధిత శాఖలకు వెంటనే అప్పగించాలన్నారు. ఎంపీడీఓలు, సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుని ఈ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. ఈ నిర్మాణాల్లో పురోగతి స్పష్టంగా కనిపించాలన్నారు. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లకు సంబంధించిన అంచనాలను రెండు రోజుల్లోగా పంపించాలన్నారు. జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలని, ఉపాధిహామీ పథకంలో భాగంగా ఉద్యానవన పనులకు సంబంధించి మంజూరు తీసుకుని పనులు చేపట్టాలన్నారు. ఇప్పటికే మంజూరైన పనుల్లో మొక్కలు నాటడం పూర్తి కావాలని, పీఎంజీఎస్‌వై కింద 12 మండలాల్లో 108 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. ఈ పనులకు సంబంధించి రెండు రోజుల్లో ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఉపాధిహామీ పథకంలో దుర్వినియోగం అయిన నిధులను తిరిగి రికవరీ చేయాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లే అవుట్ పరిధిలో సమస్యలు గుర్తించి నివేదికను పంపించాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్, ఈకేవైసీ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకంలో భాగంగా జిల్లాలో 46 కెనరా బ్యాంకు బ్రాంచీల్లో వచ్చే వారం నుంచి ఖాతాలను తెరిచే ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. డ్వామా పీడీ శీనారెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య, సీపీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, డీపీఓ నారాయణరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. ముందుగా ఉదయం భూసేకరణ, రెవెన్యూ అంశాలపై కలెక్టరేట్‌లో జేసీ కె.శ్రీనివాసులు తన చాంబర్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఇందులో భాగంగా రీసర్వే, జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, సీసీఆర్‌సీ కార్డులు, చుక్కల భూములకు సంబంధించి పూర్తిస్థాయి హక్కుల పత్రాల పంపిణీ, పౌరసరఫరాలు తదితర అంశాలపై సమీక్షించారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్

చీకట్లోనే పాదయాత్ర

● జనం స్పందన కరువు

చీమకుర్తి: నారా లోకేష్ యువగళం పాదయాత్ర చీకట్లోనే సాగింది. సంతనూతలపాడు శివారు పొగాకు గోడౌన్‌ల వద్ద క్యాంప్ సైట్ నుంచి మంగళవారం సాయంత్రం 5 గంటలకు పాదయాత్ర ప్రారంభమైంది. రెండు కిలోమీటర్లు నడవగానే చీకటి పడిపోయింది. మిగిలిన 8 కిలోమీటర్లు ఒంగోలు శివారులో ఉన్న పీర్లమాన్యం వరకు దాదాపు 4 గంటలు చీకట్లోనే సాగింది. సంతనూతలపాడు చెరువు కట్ట వద్ద లోకేష్ చిత్రపటాన్ని ఆవిష్కరించడం, బస్టాండ్‌లో టీడీపీ నాయకుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సంతనూతలపాడు బస్టాండ్‌లో ఒంగోలు నుంచి వచ్చిన మోటర్ సైకిళ్ల మెకానిక్‌లతో మాట్లాడారు. ఇవి మినహా పాదయాత్ర మొదలైన వద్ద నుంచి పీర్ల మాన్యం క్యాంప్ సైట్ వద్దకు వచ్చే వరకు ఎలాంటి ఉపన్యాసాలు లేవు. స్థానిక ప్రజలు, రైతులు కలిసి తమ సమస్యలు చెప్పుకుంది లేదు. యువకులు గళం విప్పింది లేదు. కర్నూల్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలు నుంచి పెద్దగా స్పందన లభించలేదు. పీర్లమాన్యం, ఎండ్లూరు డొంక, పేర్నమిట్ట ప్రాంతాల్లో టీడీపీ నాయకులు గజమాలలతో స్వాగతం పలికారు.



మోటార్ మెకానిక్‌లతో మాట్లాడుతున్న లోకేష్

క్లుప్తంగా

నేడు ఆడుదాం ఆంధ్రాపై సమీక్ష

ఒంగోలు: ఆడుదాం ఆంధ్రా పేరుతో అక్టోబర్ 2 నుంచి 41 రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కార్యక్రమ ఏర్పాట్లపై బుధవారం కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధ్యక్షతన సమీక్ష నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈఓ ఎంవీఎస్ లోకేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక స్పందన సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఫైనాన్స్ షోరూమ్‌లో రూ.5 లక్షలు చోరీ



షోరూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్సైలు సువర్ణ, వెంకటేశ్వరనాయక్

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారులోని కళాశాల రోడ్డులో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలు పక్కనే ఉన్న ఫైనాన్స్ ఆటో షోరూమ్‌లో మంగళవారం చోరీ జరిగినట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. మంగళవారం ఉదయం 9 గంటలకు షోరూమ్ ఓపెన్ చేసి చూడగా టేబుల్ సొరుగులో ఉంచిన రూ.5 లక్షల నగదు, ల్యాప్‌ట్యాప్ కనిపించలేదని నిర్వాహకుడు వెంకట చౌదరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని టూటౌన్ ఎస్సై సువర్ణ, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ పరిశీలించి వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో అమరా శ్రీనివాసరావు మృతదేహం

ఒంగోలు టౌన్: జేసీబీ వాహనాన్ని ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం.. చీమకుర్తి గ్రామానికి చెందిన లారీ ఓనర్ అమరా శ్రీనివాసరావు(50) వ్యక్తిగత పనుల నిమిత్తం త్రోవగుంట వెళ్లారు. పని పూర్తయిన తరువాత తిరుగు ప్రయాణంలో కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ సమీపంలోని సితార రెసిడెన్సీ ఎదురుగా జేసీబీని ఓవర్ టేక్ చేయబోయారు. ఈ క్రమంలో బైకు స్కిడ్ కావడంతో జేసీబీ ముందు భాగానికి తగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వెంట తెచ్చుకున్న హెల్మెట్‌ను తలకు ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పి ఉండేదని సంఘటనా స్థలంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు అభిప్రాయపడ్డారు.

వీరులారా.. వందనం

సరిగ్గా 23 ఏళ్ల క్రితం..
1999 జూలై 26వ తేదీ దేశమంతా 'జయహో భారత్' అంటూ విజయ నాథం చేసింది. 1999 ఏప్రిల్లో దాయాది దేశం పాకిస్తాన్ కార్గిల్‌ను ఆక్రమించేందుకు చేపట్టిన ఆపరేషన్ కోహ్–ఇ–పైమాను భారత త్రివిధ దళాలు తిప్పికొట్టాయి. ఆపరేషన్ విజయ్, ఆపరేషన్ సఫేద్ సాగర్ పేరుతో భారత దళాలు చేసిన భీకర దాడితో పాకిస్తాన్ తోక ముడిచింది. ఈ క్రమంలో వందలాది మంది భారత సైనికులు అమరులయ్యారు. వారిలో జిల్లాకు చెందిన సైనికులూ ఉన్నారు. ఒక్క కార్గిల్‌లోనే కాదు.. పలు సందర్భాల్లో శత్రుమూకలతో జరిగిన పోరులో జిల్లాకు చెందిన 33 మంది వీరమరణం పొందారు. నేడు కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరుల త్యాగాలపై ప్రత్యేక కథనం..

- దేశ సేవలో ముందున్న పశ్చిమ ప్రకాశం వాసులు
- గిద్దలూరు నియోజకవర్గంలో 10 వేల మందికి పైగా మాజీ సైనికులు
- జిల్లాలో 33 మంది అమరవీరులు
- నేడు కార్గిల్ దివస్



కార్గిల్ యుద్ధంలో అశువులుబాసిన జి.శ్రీనివాసులు (ఎల్‌కోట గ్రామం)



ఆపరేషన్ రక్షక్‌లో వీరమరణం పొందిన నంద్యాల శ్రీనివాసులు (కంభం)



ఆపరేషన్ పవన్‌లో మరణించిన పత్తి వెంకట నారాయణ(తురిమెళ్ల)



కంభం: సైనికులు దేశ సరిహద్దుల్లో ప్రాణాలొడ్డి నిత్యం పహారా కాస్తుండటం వల్లే ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారనేది ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. భారత సైన్యంలో పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు నియోజకవర్గం నుంచి వేలాది మంది ప్రాతినిధ్యం వహిస్తుండటం జిల్లాకే గర్వకారణం. జిల్లాలో సుమారు 14 వేల మంది మాజీ సైనికులు ఉండగా అందులో ఒక్క గిద్దలూరు నియోజకవర్గంలోనే సుమారు 10 వేల మంది వరకు మాజీ సైనికులున్నారు. వీరితోపాటు సుమారు 7 వేల మంది వరకు ప్రస్తుతం ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. వివిధ యుద్ధాల్లో 33 మంది ప్రకాశం జిల్లాకు చెందిన సైనికులు వీరమరణం పొందగా అందులో గిద్దలూరు నియోజకవర్గంలో 17 మంది సైనికులు ఉన్నారు.



కంభం మండలంలో ఆరుగురు అమరవీరులు

కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామానికి చెందిన పత్తివెంకట నారాయణ 1981లో ఆర్మీలో చేరారు. 1988లో శ్రీలంకలో జరిగిన ఆపరేషన్ పవన్‌లో వీరమరణం పొందారు. కొన్నిరోజుల వరకు అతను ఏమయ్యాడో కుటుంబ సభ్యులకు తెలియదు. భారత ఆర్మీ అధికారులు అక్కడే అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అదే గ్రామానికి చెందిన సీహెచ్ రంగస్వామి 1962లో చైనా యుద్ధంలో, ఎం.రంగారెడ్డి 1965లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో అశువులుబాశారు. ఎల్‌కోట గ్రామానికి చెందిన జి.శ్రీనివాసులు 1999 కార్గిల్ యుద్ధంలో, కంభంకు చెందిన జి.గాలయ్య 2006లో ఆపరేషన్ రక్షక్‌లో, నంద్యాల శ్రీనివాసులు 2004లో ఆపరేషన్ రక్షక్‌లో ప్రాణాలు త్యజించారు.

సైన్యంలో పనిచేయడం ఎంతో తృప్తినిచ్చింది



1961లో ఆర్మీలో చేరి 1984లో రిటైరయ్యా. 1962లో చైనాతో జరిగిన యుద్ధం, 1965, 1971లో పాక్‌తో జరిగిన యుద్ధాల్లో, 1984లో బ్లూస్టార్ ఆపరేషన్‌లో పాల్గొన్నా. నా పెద్ద కుమారుడు సయ్యద్ మస్తాన్ ఆర్మీలో పనిచేస్తూ 1995లో జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో కన్నుమూశాడు. చిన్నకుమారుడు సయ్యద్ ఇమామ్ 22 ఏళ్లు సైన్యంలో పనిచేశాడు. మా కుటుంబం దేశ సేవలో భాగం కావడం ఎంతో సంతృప్తినిచ్చింది.

– సయ్యద్ సత్తార్, మాజీ సైనికుడు, కంభం

సెంట్రల్ స్కూల్ ఏర్పాటు చేయాలి



నేను 1967 నుంచి 1991 వరకు ఆర్మీలో పనిచేశాను. 1971లో జరిగిన యుద్ధంలో, 1984లో జరిగిన బ్లూస్టార్ ఆపరేషన్‌లో పాల్గొన్నా. సైనికులు, మాజీ సైనికులు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో సెంట్రల్ స్కూల్ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– జి.పాండు, మాజీ సైనికుడు, కంభం

మాజీ సైనికుల భవనానికి స్థలం కేటాయించాలి



కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల్లో మాజీ సైనికులు అధికంగా ఉన్నారు. వివిధ రకాల సమస్యలతో మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు వస్తుంటారు. మా సమస్యలు పరిష్కరించుకునేందుకు, సమావేశాలు జరిపేందుకు అధికారులు స్థలం మంజూరు చేస్తే కార్యాలయం నిర్మించుకుంటాం.

– కెప్టెన్ ఎస్.కె.వలి, మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు

ఆర్మీలో పనిచేయడం గర్వంగా ఉంది



1999వ సంవత్సరంలో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నా. 18 సంవత్సరాలు దేశం కోసం పనిచేయడం ఎంతో గర్వంగా ఉంది. మన ప్రాంతం నుంచి వేలాది మంది యువకులు దేశ సేవలో ముందుకు సాగుతున్నారు.

– టి.అంకయ్య, మాజీ సైనికుడు కంభం

పేదలందరికీ నాణ్యమైన వైద్యం

- ఆపరేషన్ సమయంలో కుటుంబానికి ఆర్థిక భరోసా
- నాడు ఆరోగ్యశ్రీలో 919 వ్యాధులు మాత్రమే.. నేడు వాటి సంఖ్య 2,275
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు



డాక్టర్ అశోక్‌బాబు

ఒంగోలు: పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనేదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ అనగానే గుర్తుకు వచ్చేది డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, నేటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ఆరోగ్యశ్రీకి జన్మనిచ్చింది డాక్టర్ వైఎస్సార్ అయితే , బలోపేతం చేసి కార్పొరేట్ వైద్యాన్ని పేదల చెంతకు చేర్చి పునర్జన్మనిచ్చింది వైఎస్ జగన్ మాత్రమే అన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు 40 వేల మందికి పైగా డాక్టర్లు, ఫార్మసిస్టులు, పారా మెడికల్ సిబ్బంది నియామకాలు చేపట్టారన్నారు.

పేదలకూ ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ధనంతులకు మాత్రమే అందుబాటులో ఉండే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని నేడు గ్రామాల్లోకి తీసుకు వచ్చి 10032 విలేజి హెల్త్ క్లినిక్/అర్బన్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు చేశారని తెలిపారు. 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులు ఇంటివద్దకే పంపిణీ చేస్తున్నారన్నారు. వైరల్ జ్వరాలను తక్షణమే గుర్తించి సరైన వైద్యం అందించేందుకు ఇంటింటా ఫీవర్ సర్వే జరుగుతుందని, పీహెచ్‌సీ స్థాయినుంచి బోధనా సుపత్రుల వరకు ప్రత్యేక ఓపీ విధానం అమలుచేశారన్నారు. 2.14 లక్షల కోవిడ్ రోగులకు రూ.743.22 కోట్లతో వైద్య సేవలు నాడు అందించామని, గిరిజన బిడ్డలకు అండగా మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి రూ.120 కోట్లు కేటాయించడం ఆయనలోని సామాజిక స్ఫూర్తికి నిదర్శనమన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా కాక ముందే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవల 8 మెడికల్ కాలేజీలు ఉండేవని, వైఎస్సార్ కాలంలో ఒంగోలు, కడప, శ్రీకాకుళంలలో ప్రారంభించారన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ ఏకంగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రారంభించారని, వాటిలో ఐదు కాలేజీలు ఈ ఏడాది ప్రారంభం కానున్నాయంటే సీఎం ఎంత కృతనిశ్చయంతో ఉన్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా దిగిపోయే నాటికి ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.610 కోట్లు ఉంటే వాటిని తీర్చడంతోపాటు ప్రతి రెండు నెలలకోసారి సమీక్షిస్తూ నిధులను సీఎం విడుదల చేస్తున్నారన్నారు. బోధనాసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్స వసతుల కల్పనకు రూ.118 కోట్లు కేటాయించామన్నారు. పీహెచ్‌సీ సెంటర్లలో సైతం 24 గంటలు వైద్య సేవలు అందించామని, ఒంగోలు రిమ్స్‌లో నేడు సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ వంటివి అనేకం అందుబాటులోకి తెచ్చామన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కేవలం 26 ఆసుపత్రులకు మాత్రమే ఎన్‌క్యాష్‌మెంట్ గుర్తింపు ఉండేదని, కానీ నేడు ఆ సంఖ్య 443కు చేరిందన్నారు. అదే విధంగా ఆరోగ్యశ్రీలో గతంలో కేవలం 919 వ్యాధులు మాత్రమే ఉంటే వాటి సంఖ్య నేడు 2275కు చేరిందనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం



టిప్పర్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తున్న ఎస్సై



గణపతి చెక్ పోస్టు వద్ద నిలిచిన వాహనాలు

- విజయవాడకు చెందిన ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ
- ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలు
- మూడు గంటలపాటు నిలిచిన వాహనాల రాకపోకలు

పెద్దదోర్నాల: ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, టిప్పర్లు ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలు కాగా, వాహనాల రాకోపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సంఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని తుమ్మలబైలు–చిన్నారుట్ల గిరిజన గూడేల మధ్య మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం వెళ్తున్న విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, శ్రీశైలం నుంచి పెద్దదోర్నాల వైపు వస్తున్న టిప్పర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. టిప్పర్ డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు రోడ్డుపైనే నిలిచిపోగా, టిప్పర్ మాత్రం రోడ్డు మార్జిన్‌లోని ఇనుప కమ్మీలను తగిలి ఆగింది. దీంతో ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు శ్రీశైలం ప్రధాన రహదారిలో సంఘటన స్థలానికి ఇరువైపులా ఐదు కిలోమీటర్ల మేర భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై అంకమ్మరావు, ఆర్టీసీ కంట్రోలర్ హసన్‌బాషాలు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. దట్టమైన నల్లమల అభయారణ్యంలో మూడు గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు ఊపిరి పీల్చుకుని బయట పడ్డారు. ముందస్తు జాగ్రత్తగా శ్రీశైలం వెళ్లే వాహనాలను గణపతి చెక్ పోస్టు వద్ద ఎస్సై నిలిపివేయించడంతో సమస్య తీవ్రత తగ్గింది.

రైతులకు రెట్టింపు ఆదాయం

- అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



సీఎం వర్చువల్ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు తదితరులు

ఒంగోలు: రైతుల ఆదాయాల్ని రెట్టింపు చేసేలా వారి వ్యవసాయ, ఉద్యానవన ఉత్పత్తులను నిల్వచేసి మంచి ధరలకు విక్రయించుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల్లో నిర్మించిన కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజీలను వర్చువల్ విధానంలో ఆయన ప్రారంభించారు. ఈ వర్చువల్ కార్యక్రమానికి గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి తదితరులతో కలిసి కలెక్టర్ ప్రకాశం భవనం నుంచి హాజరయ్యారు. జిల్లాలోని గిద్దలూరు మండలం మోడంపల్లి గ్రామంలో నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించి రైతులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా కలెక్షన్ సెంటర్ పరిధిలోని వైఆర్ గ్రూప్స్ అనే ఎఫ్‌పీవోకు సీఈవోగా ఉన్న వెంకట్రామిరెడ్డి కూడా తమకు కలుగుతున్న ఆర్థిక ప్రయోజనాన్ని సీఎంతో పంచుకున్నారు. అనంతరం మోడంపల్లి నుంచి వచ్చిన రైతులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎఫ్‌పీవో(ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)లకు అండగా ఉండేలా కలెక్షన్ సెంటర్లు, కోల్డు స్టోరేజీల నిర్మాణానికి ప్రభుత్వం 75 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఒక్కో యూనిట్ విలువ రూ.15 లక్షలుగా ఉందని, అందులో ఎఫ్‌పీవోలు కేవలం రూ 3.75 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ విధంగా జిల్లాలో 28 కలెక్షన్ సెంటర్లు, రెండు కోల్డు స్టోరేజీలను ఎఫ్‌పీవోలు నిర్మించుకుంటున్నాయన్నారు. పొలాల నుంచి నేరుగా విక్రయానికి కాకుండా ఈ సెంటర్లు, కోల్డు స్టోరేజీలకు కూరగాయలను, ఉద్యానవన ఉత్పత్తులను తరలించి వాటిని గ్రేడ్ చేసుకుని అవసరమైన అదనపు విలువను జోడించి కొనుగోలుదారులకు విక్రయించుకోవడం ద్వారా రైతుల లాభాలు పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలోని ఎఫ్‌పీవోలు ఈ విధంగా ప్రాసెస్ చేసి మార్కెట్ డిమాండ్‌ను బట్టి గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, తెలంగాణాలోని ఇతర జిల్లాల్లో ఉన్న హోల్‌సేల్ మార్కెట్లకు తరలించవచ్చని వివరించారు. జిల్లాలోని మిగిలిన ఎఫ్‌పీవోలను కూడా ఎంఐడీసీహెచ్, ఆర్‌కేవీవై పథకాల కిందకు తీసుకువచ్చి ఈవిధంగా ప్రభుత్వ రాయితీతో కలెక్షన్ సెంటర్లు, కోల్డు స్టోరేజీలను నిర్మించుకునేలా అవగాహన కల్పిస్తామన్నారు. రానున్న రోజుల్లో ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేసేందుకు జిల్లాలో ఉన్న అవకాశాలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, ఏపీ ఎంఐపీ డీపీ పీవీ రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

30 శాతం అదనపు లాభం వస్తుంది

ఎఫ్‌పీవోను ఏర్పాటుచేస్తున్నపుడు ఇదేదో నామమాత్రంగా ఏర్పాటు చేస్తున్నామని అనుకున్నా. కానీ రైతులను సంఘటిత పరిచి కలెక్షన్ సెంటర్ ద్వారా హోల్‌సేల్ మార్కెట్లకు ఉద్యానవన ఉత్పత్తులను తరలించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. గత వారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మార్కెట్‌కు కూడా మేము సరఫరా చేశాం. మార్కెట్లలోని డిమాండ్‌ను తెలుసుకుని దళారుల ప్రమేయం లేకుండా ఎఫ్‌పీవోలే నేరుగా విక్రయించుకుంటున్నందున గతంతో పోలిస్తే మా ఆదాయం 30 శాతానికి పైగా పెరిగింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– వెంకట్రామిరెడ్డి, రైతు, మోడంపల్లి

బాలుర సింగిల్స్ విజేత నెల్లూరు

- బాలికల సింగిల్స్ విజేత కడప
- ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల విజేతలతో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2023 మంగళవారం ముగిసింది. సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఇండోర్ స్టేడియం మరమ్మతులు, ఆధునికీకరణకు సుమారు రూ.2 కోట్ల ప్రభుత్వ గ్రాంటును ఇచ్చేందుకు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో సీఎం కప్, రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లీగ్‌లు నిర్వహించడం ద్వారా క్రీడాకారులందరూ ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. త్వరలో 'ఆడుదాం ఆంధ్రా' ద్వారా సచివాలయస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించే పోటీలతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 రోజులపాటు క్రీడాకారులకు పండగ వాతావరణం నెలకొంటుందన్నారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలలో విజయవాడలో ఏపీ సీఎం జగన్స్ యునెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ టోర్నీలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు, 75 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, టీమ్ మేనేజర్స్ పాల్గొనడం అభినందనీయమన్నారు.

మద్యం మత్తులో యువకుడు మృతి

పెద్దారవీడు: పూటుగా మద్యం తాగిన యువకుడు గొంతు ఎండిపోయి మృతి చెందిన సంఘటన పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు గ్రామం సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. త్రిపురాంతకం మండలం హసనాపురం గ్రామానికి చెందిన గుమ్మా ఏడుకొండలు స్నేహితునితో కలిసి బైక్‌పై మార్కాపురం వెళ్లాడు. తన బైక్ ఫైనాన్స్ కిస్తీలు పూర్తిగా కట్టిన సందర్భంగా మార్కాపురంలో మద్యం సేవించి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో దేవరాజుగట్టు సమీపంలో బైక్ రోడ్డు పక్కన నిలిపి పడుకున్నారు. స్థానికులు చూసి ఏడుకొండలు(28) గొంతులో నీరు పోసినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే అతను మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.